క్లుప్తంగా

శ్రీరాముని జీవితం మానవాళికి ఆదర్శం



మాట్లాడుతున్న గుమ్ముల సత్యంజీ

గోదావరిఖనిటౌన్: శ్రీరాముని జీవితం మానవాళికి ఆదర్శమని, శ్రీరాముని మందిరం స్వాభిమాన సంకేతమని విశ్వహిందూ పరిషత్ భాగ్యనగర్ క్షేత్ర సంఘటన కార్యదర్శి గుమ్ముల సత్యంజీ అన్నారు. స్థానిక శ్రీకోదండ రామాలయంలో శనివారం ఏర్పాటు చేసిన శ్రీరామోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత శ్రీరాముని అడుగు జాడల్లో నడవాలని ఆయన కోరారు. విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్, తెలంగాణ ప్రాంత గోరక్ష ప్రముఖ్ ఇసంపల్లి వెంకన్న, జిల్లా కార్యదర్శి నాగులమల్యాల సత్యం, మ్యాడగోని రవీందర్, కొండపర్తి లింగన్న, మునిగాల సంపత్, అడిగొప్పుల రాజు, ములుకుంట్ల శ్రీనివాస్, చక్రపాణి, అరవింద్, మాతృశక్తి భవానీ, దుర్గాభవానీ సభ్యులు కోట తిరుమల, సూర్యదేవర జ్యోతి, లలిత, స్వప్న, మమత, స్వరూప పాల్గొన్నారు.

ముందస్తుగా రాములోరి పెళ్లి



సీతారాముల (బొమ్మల) కల్యాణం

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని శ్రీలక్ష్మిగణపతి ఆలయంలో శనివారం ముందస్తుగా శ్రీసీతారాముల కల్యాణ వేడుక (బొమ్మలపెళ్లి) వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భార్గవశర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా చిన్నారుల నాటక ప్రదర్శన అలరించింది.

జీజీహెచ్‌లో పేషెంట్లకు పండ్లు పంపిణీ

కోల్‌సిటీ: గోదావరిఖని సిమ్స్ జీజీహెచ్ ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం ఇన్‌పేషెంట్లకు పుట్ట నారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. స్థానిక ముస్త్యాల గ్రామానికి చెందిన సింగరేణి కార్మికుడు పుట్ట నారాయణ వర్ధంతిని పురస్కరించుకొని ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేసినట్లు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పుట్ట రాజన్న తెలిపారు. కార్యక్రమంలో రాజు, రమేశ్, నర్సింగ్ పాల్గొన్నారు.

ప్రజాధర్నా విజయవంతం చేయండి

యైటింక్లయిన్‌కాలనీ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల8న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద చేపట్టనున్న ప్రజా ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మంథని కార్యదర్శి బి.అశోక్ పిలుపునిచ్చారు. యైటింక్లయిన్‌కాలనీ ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో నాయకులతో కలిసి శనివారం ధర్నాకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. తక్షణమే ఆపరేషన్ కగార్ నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. ప్రజా ధర్నాలో అన్నివర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నాయకులు పద్మ, కాంతయ్య, రాజనర్సు, శారద, పోచయ్య, శకర్, లింగయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న తాటికొండ శంకర్

కమాన్‌పూర్: కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ తాటికొండ శంకర్ సూచించారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు మేకల సంపత్, బొమ్మగాని అనిల్‌గౌడ్, సాయికుమార్, గుర్రం లక్ష్మిమల్లు, కొండ వెంకటేశ్, నీలం శ్రీనివాస్, రాసకొండ రవి, సాన సురేశ్, పల్లె నారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

ఓదెల: ఓదెల గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం రూ.25లక్షలు మంజూరు చేసినందుకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే విజయరమణారావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ ఆశయసాధనకు కృషిచేయాలి



మంథని: పూలమాల వేస్తున్న పుట్ట మధు



కోల్‌సిటీ: నివాళి అర్పిస్తున్న డిప్యూటీ కమిషనర్



సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయంలో..



రామగుండం: అంతర్గాం తహసీల్దార్ కార్యాలయంలో..



పెద్దపల్లిరూరల్: ఎస్ఈ ఆఫీసులో..



ధర్మారంలో..

పెద్దపల్లిరూరల్/మంథని/కోల్‌సిటీ/సుల్తానాబాద్/రామగుండం/ధర్మారం/ఓదెల/జూలపల్లి/ముత్తారం/ఎలిగేడు/ కాల్వశ్రీరాంపూర్: మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పలువురు వక్తలు కోరారు. శనివారం జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు. ఆయన దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన అడుగు జాడల్లో నడవాలని అంబేడ్కర్ సంఘం నాయకులు అన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

జ్యోతినగర్/యైటింక్లయిన్‌కాలనీ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. నగరంలోని ఎన్టీపీసీ భీమునిపట్నం, 15, 16, 17, 18, 19వ డివిజన్లలో ఆయన సన్నబియ్యం పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. నాయకులు మారెల్లి రాజిరెడ్డి, గుండేటి రాజేశ్, సాగంటి శంకర్, శంకర్ నాయక్, జక్కుల దామోదర్‌రావు, చక్రపాణి, మార్క రాజు, రాములు, తిరుపతిరెడ్డి, సారయ్య నాయక్, యాదగిరి తిరుపతి, రాజేశం తదితరులు పాల్గొన్నారు. అల్లూరు శివారు గంగిరెద్దుల(రాజన్నల)వాడలోని ఓ పేదింట్లో రేషన్ షాపు ద్వారా పంపిణీ చేసిన సన్నబియ్యంతో కూడిన భోజనం చేసిన ఎమ్మెల్యే.. తర్వాత కుటుంబ సభ్యుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



యైటింక్లయిన్‌కాలనీ: సన్నబియ్యంతో వండిన భోజనం చేస్తున్న ఎమ్మెల్యే ఠాకూర్

పేదల సంక్షేమమే ధ్యేయం

పాలకుర్తి: పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అన్నారు. పుట్నూర్‌లో సన్నబియ్యం పంపిణీ చేసి మాట్లాడారు. అలాగే రాణాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు.

సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మకం



సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్: పేదలకు సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మకమని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మొట్లపల్లిలో కొత్త గ్రామపంచాయతీ భవనం, కాల్వశ్రీరాంపూర్, మడిపెల్లికాలనీ, పెగడపల్లి, గంగారం, తారుపల్లి, మీర్జంపేట, ఇదులాపూర్, చిన్నరాతుపల్లి, పెద్దరాతుపల్లి, కిష్టంపేటలో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, స్థానిక బస్టాండ్ చౌరస్తాలోఎమ్మెల్యే శనివారం చలివేంద్రం ప్రాంభించారు. పలు గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ ప్రక్రియ ప్రారంభించారు. పేదలకు సన్నబియ్యం పంపిణీ పథకంతో ప్రభుత్వంపై రూ.కోట్ల భారం పడినా సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ చదువు రాంచంద్రారెడ్డి, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులకు వ్యక్తిగత సమాచారం ఇవ్వొద్దు

పాలకుర్తి: సైబర్ మోసాలపై ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన వివరాలు చెప్పొద్దని పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో బసంత్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో సీఐ మాట్లాడారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి వివరాలు తెలియజేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు కాల్ చేయాలన్నారు. మహిళల భద్రత కోసం షీ-టీమ్స్ పనిచేస్తున్నాయని, ఈ సందర్భంగా షీ టీమ్స్ ప్రాముఖ్యత గురించి స్థానికులకు వివరించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమైందని, గ్రామాల్లో ముఖ్య కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నేరాల నియంత్రణలో పోలీసులకు సహకరించాలని కోరారు. బసంత్‌నగర్ ఎస్సై స్వామి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్‌కుమార్

టీచర్ కుటుంబానికి రూ.3.61లక్షలు అందజేత



డిపాజిట్ బాండ్ అందజేస్తున్న మనాలీఠాకూర్

గోదావరిఖనిటౌన్: ఇటీవల గుండెపోటుతో మరణించిన ప్రైవేట్ టీచర్ బాలసాని సత్యనారాయణగౌడ్ కుటుంబానికి పలువురు చేయూత అందించారు. స్థానిక అడ్డగుంటపల్లిలోని విద్యాభారతి స్కూల్ పూర్వ విద్యార్థులు రూ.3.20లక్షలు, ట్రస్మా రామగుండం తరఫున రూ.41వేలు మొత్తం రూ.3.61లక్షలతో ఎస్‌బీఐ ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను ఎమ్మెల్యే సతీమణి మనాలీ ఠాకూర్ చేతుల మీదుగా శనివారం సత్యం భార్య భాగ్యలక్ష్మి, పిల్లలకు అందజేశారు. అడ్డగుంటపల్లిలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో మనాలీ ఠాకూర్ మాట్లాడుతూ సత్యం కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని తెలిపారు. ట్రస్మా రాష్ట్ర కన్వీనర్ అరుకాల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సేకరించిన ఈ డబ్బు సత్యం కుటుంబానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ట్రస్మా నాయకులు బందారపు యాదగిరిగౌడ్, పరుపాటి అంజారెడ్డి, కంది రవీందర్‌రెడ్డి, అదర్‌సండే సమ్మారావు, చందుపట్ల తిరుపతిరెడ్డి, కొత్త శ్రీనివాస్‌రెడ్డి, జీల రవి, డి.హరీశ్, నాగరాజు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం తొలగింపు ఉండదు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ టీ జంక్షన్ రోడ్డు వెడల్పులో అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగిస్తారని కొందరు అపోహలు సృష్టిస్తున్నారని, రోడ్ల వెడల్పులో విగ్రహాల తొలగింపు ఉండదని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, నగరపాలక కమిషనర్ (ఎఫ్ఏసీ) జె.అరుణశ్రీ తెలిపారు. ప్రజలు ఎలాంటి అపోహలు నమ్మొద్దని, రోడ్డు వెడల్పులో విగ్రహాల తొలగింపు ఉండదని స్పష్టం చేశారు.

పేదల కడుపు నింపేందుకే సన్నబియ్యం పంపిణీ

రామగిరి: పేదలు కడుపునిండా భోజనం చేసేందుకే సీఎం రేవంత్ రెడ్డి తెల్లకార్డు ఉన్న ప్రతీ వ్యక్తికి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్ అన్నారు. మండలంలోని నాగెపల్లిలో శనివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి సన్నబియ్యం కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో నాయకులు తోట చంద్రయ్య, ఆరెల్లి దేవక్క, గంట వెంకటరమణారెడ్డి, మైదం వరప్రసాద్, వనం రాంచందర్‌రావు, బొల్లపల్లి స్వామి, బర్ల శ్రీనివాస్, తీగల సమ్మయ్య, బాబురావు, కండె పోచం పాల్గొన్నారు.

సుల్తానాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని జవహర్‌నగర్, సుగ్లాంపల్లిలో సన్నబియ్యం పంపిణీని గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్ శనివారం ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, నాయకులు సాయిరి మహేందర్, అమిరిశెట్టి రాజలింగం, తిరుపతి, దున్నపోతుల రాజయ్య, దుగ్యాల సంతోష్‌రావు, శేఖర్, రాములు పాల్గొన్నారు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పలు గ్రామాల్లోని రేషన్‌షాపుల్లో శనివారం సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. ఇందులో భాగంగానే కుందనపల్లిలో కాంగ్రెస్ మైనార్టీ మహిళా సెల్ మండల అధ్యక్షురాలు నాజియా సుల్తానా చేతుల మీదుగా ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రతినిధులు సంగనవేణ శేఖర్, జక్కుల నారాయణ, సుంకరి రవి, రేషన్ డీలర్ చిలుక రామ్మూర్తి ఉన్నారు.

జూలపల్లి: పేదల సంక్షేమమే ధ్యేయంగా అమలు చేస్తున్న సన్న బియ్యాన్ని తెల్లరేషన్ కార్డుదారులు వినియోగించుకోవాలని మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగిపెల్లి చుక్కయ్య అన్నారు. మండలంలోని కోనరావుపేటలో తెల్లరేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ ప్రారంభించారు. యూత్ కాంగ్రెస్ నాయకుడు దాడి కుమార్, కూసుకుంట్ల రాంగోపాల్‌రెడ్డి, అనంతరెడ్డి, ముప్పిడి శ్రీనివాస్, మలారపు సంజీవ్, రాజరాంరెడ్డి ఉన్నారు.



సుల్తానాబాద్: సన్నబియ్యం పంపిణీ చేస్తున్న గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షుడు అన్నయ్యగౌడ్

రేషన్‌షాపులో సన్నబియ్యం పంపిణీ

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఎఫ్‌సీఐ గేట్ రేషన్ షాపులో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని డివిజన్ అధ్యక్షుడు బూర్ల శ్రీనివాస్ ప్రారంభించారు. మానాల ప్రభాకర్, గౌస్, సతీశ్, కన్నూరి శంకర్, ఆడెపు రాజేశం, వడ్నాల రాజేశం, దొంత శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముత్తారం: మండలంలోని అడవిశ్రీరాంపూర్, మైదంబండ, మచ్చుపేట తదితర గ్రామాల్లో శనివారం సన్న బియ్యం పంపిణీ చేశారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, నాయకులు మద్దెల రాజయ్య, గాదం శ్రీనివాస్, గోస్కుల రమేశ్, బియ్యని శివకుమార్, బక్కతట్ల వినీత్, మేడగోని సతీశ్, గోవిందుల ఆనంద్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• ఆంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయ హుండీని ఆలయ ధర్మకర్తలు శనివారం లెక్కించారు. ఈ సంవత్సరంలో ఆలయానికి రూ.14,114 వచ్చినట్లు ఆలయ ధర్మకర్త లోక లింగారెడ్డి తెలిపారు. ఈ లెక్కింపులో ధర్మకర్తలు కొప్పుల మహేశ్, దేవసాని శంకరయ్య, బెజ్జంకి రమేశ్, తాటికొండ వేణు, భాను చందర్, అమరగాని పురుషోత్తం, వజ్రారెడ్డి ఉన్నారు.

• ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడికి సన్మానం

మంథని: మంథని ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎల్లంకి వంశీని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శుక్రవారం రాత్రి అభినందించారు. మంథనిలో జరిగిన కార్యక్రమంలో మంత్రి ఆయనను సన్మానించారు.

• దళితవాడలో పలువురిపై పిచ్చికుక్కల దాడి

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ దళితవాడలో శనివారం పిచ్చికుక్కలు పలువురిని గాయపరిచాయి. కొంతకాలంగా కాలనీలో పిచ్చికుక్కల బెడద పెరిగిందని దళిత కాలనీవాసులు వాపోయారు. జీడికంటి నర్సయ్య మూడేళ్ల కుమారుడు చిన్నా, అలాగే పుల్లూరి మల్లయ్య అనే వృద్ధుడిపై దాడి చేసి గాయపరిచాయి. వెంటనే వీరిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి వ్యాక్సినేషన్ వేయించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి స్పందించి పిచ్చికుక్కల బెడదను నియంత్రించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

• సహజ కవయిత్రి రాజేశ్వరికి సత్కారం

పెద్దపల్లిరూరల్: పట్టణానికి చెందిన సహజ కవయిత్రి బొమ్మిదేని రాజేశ్వరిని జాతీయ విద్యాపరిషత్, స్వయంభు వెంకటేశ్వరస్వామి, హనుమాన్ దేవాలయం ట్రస్టు సంయుక్తంగా శనివారం సత్కరించింది. స్వయంభు వెంకటేశ్వరస్వామి వసంతోత్సవాల సందర్భంగా కవి సమ్మేళనం నిర్వహించారు. ఆధ్యాత్మికతను జోడిస్తూ శ్రీరాముని కీర్తిస్తూ రాజేశ్వరి రాసి చదివిన కవిత పలువురి ప్రశంసలను పొందింది. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆమెను సత్కరించారు.

స్వాతంత్య్ర సమరయోధుడికి అశ్రునివాళి



నివాళి అర్పిస్తున్న ఆర్డీవో గంగయ్య

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు తానిపర్తి కాంతారావు శుక్రవారం మృతిచెందగా శనివారం బంధువులు, గ్రామస్తుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు ముగిశాయి. శుక్రవారం రాత్రి పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు కాంతారావు పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కాగా శనివారం పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య నివాళి అర్పించారు. డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్ఐ శేఖర్, స్వాతంత్య్ర సమరయోధుల సంఘం బాధ్యులు, మాజీ ఎంపీపీ తానిపర్తి మోహన్‌రావు, మాజీ సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలి

గోదావరిఖని: వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. ఆర్జీ–1 జీఎం కార్యాలయంలోని తన చాంబర్‌లో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. బొగ్గు ఉత్పత్తి, మట్టి వెలికితీత, ఉత్పాదకత గురించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. బొగ్గు రవాణా మరింత వేగవంతం చేయాలని సూచించారు. గత ఆర్థిక సంవత్సరంలో వార్షిక లక్ష్యాలను సాధించడానికి కృషిచేసిన అధికారులు, కార్మికులు, కార్మిక సంఘాల నాయకులకు అభినందనలు తెలిపారు. ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, అధికారులు చంద్రశేఖర్, వెంకటేశ్వర్‌రావు, ఆంజనేయులు, శివనారాయణ, చిలక శ్రీనివాస్, రమేశ్, ఆంజనేయప్రసాద్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, కర్ణ, కుమారస్వామి, వరవరప్రసాద్, రాజేశ్, లక్ష్మిరాజం, వీరారెడ్డి, బీమా, హనుమంతరావు పాల్గొన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

కొత్త గనులతోనే సింగరేణికి మనుగడ

గోదావరిఖని: కొత్తగనులు వస్తేనే సింగరేణి సంస్థకు మనుగడ సాధ్యమని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. జీడీకే–2వ గనిలో శనివారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గనులు రాకపోతే కార్మికుల ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లుతుందన్నారు. కొత్త గనుల కోసం పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2015లో బొగ్గు గనుల జాతీయకరణ చట్టాన్ని ఎంఎండీఆర్ చట్టంగా మార్చడంతో సింగరేణికి కొత్త గనులు రావడం లేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి అవకాశం ఇవ్వకుండా సంస్థకు చెందిన నాలుగు గనులను వేలంలో పాల్గొననీయకుండా ప్రయివేట్ వారికి అవకాశం కల్పించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త గనులను ప్రైవేటుకు ఇవ్వకుండా సింగరేణికి ఇచ్చేలా ఒత్తిడి తేవాలని, లేకుంటే వేలం ద్వారా సింగరేణికి కొత్త గనులు దక్కేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు రంగు శ్రీను, మడ్డి ఎల్లాగౌడ్, కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోషం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీతారామయ్య

బీఆర్ఎస్ బహిరంగ సభ జయప్రదం చేయండి

సుల్తానాబాద్: బీఆర్ఎస్ బహిరంగ సభను జయప్రదం చేయాలని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కోరారు. శనివారం మండల కేంద్రంలోని యశోద నరహరి ఫంక్షన్ హాల్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని ఆరోపించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ సీట్లు కైవసం చేసుకోవడానికి కార్యకర్తలు ప్రణాళికబద్ధంగా పని చేయాలని సూచించారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పాదయాత్రలో పాల్గొన్న సుల్తానాబాద్ కార్యకర్త ఆరెపల్లి సర్వేశ్‌ను సన్మానించారు. ఎంపీపీ బాలాజీరావు, పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్ర శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ సూర శ్యామ్, మాజీ సర్పంచ్ బోయిని రాజమల్లు, మాజీ కౌన్సిలర్ గోపి, బాబురావు, బండి సంపత్‌గౌడ్, తిరుపతి, వడల శేఖర్, వాసు, నారాయణ పాల్గొన్నారు.

ఓదెల: వరంగల్‌లో 27న జరిగే బీఆర్ఎస్ ప్లీనరీ సభను విజయవంతం చేయాలని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కోరారు. ఓదెలలోని మారుతి ఫంక్షన్ హాలులో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షతన శనివారం కార్యకర్తల సమావేశం జరిగింది. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల నుంచి కార్యకర్తలు, రైతులు, మేధావులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. మాజీ జెడ్పీటీసీ గంట రాములుయాదవ్, మాజీ ఎంపీపీ గట్టు రమాదేవిశ్రీనివాస్, మాజీ సర్పంచ్ కోట దామోదర్‌రెడ్డి, పత్తి సమ్మిరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు పోలోజు రమేశ్, నాయకులు మ్యాడగోని శ్రీకాంత్‌గౌడ్, మధు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: బీఆర్ఎస్ నేతృత్వంలో 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక రెడ్డి ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, మాజీ సర్పంచులు బైరం రమేశ్, నాగార్జున్‌రావు, శ్యాం, బుర్ర సదానందం, నాయకులు దేవయ్య, కొట్టె రవి, సారంగపాణి, రమేశ్, శంకర్, ఒడ్నాల శ్రీనివాస్, సతీశ్, మల్లయ్య, నవీన్, కుమార్ పాల్గొన్నారు.



సుల్తానాబాద్: మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

శ్రీరామనవమికి ఆలయాలు ముస్తాబు



సుల్తానాబాద్: పెరికగిద్దె హనుమాన్ ఆలయం



సుల్తానాబాద్‌రూరల్: చిన్నకల్వలలోని సీతారామచంద్రస్వామి ఆలయం



యైటింక్లయిన్‌కాలనీ: శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం



గోదావరిఖనిటౌన్: శ్రీకోదండ రామాలయం స్వాగత తోరణం



ఫెర్టిలైజర్‌సిటీ: వేంకటేశ్వరస్వామి ఆలయం



జూలపల్లి: కుమ్మరికుంటలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం

యైటింక్లయిన్‌కాలనీ/కమాన్‌పూర్/ఫెర్టిలైజర్‌సిటీ/గోదావరిఖనిటౌన్/జూలపల్లి/ఎలిగేడు/సుల్తానాబాద్‌రూరల్/కాల్వశ్రీరాంపూర్: శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం నిర్వహించనున్న సీతారాముల కల్యాణ మహోత్సవాలకు జిల్లావ్యాప్తంగా ఉన్న ఆలయాలను ముస్తాబు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తి చేశారు.